క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మంగళవారం గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలను ప్రభుత్వం ప్రారంభించిన సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని పాతబస్టాండ్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కథలాపూర్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కించపరిచేలా మాట్లాడిన ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, నాయకులు గోపిడి ధనుంజయ్‌రెడ్డి, కల్లెడ గంగాధర్, దేవారెడ్డిపాల్గొన్నారు.

మేడిపల్లి: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై,ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, దామోదర్ లక్ష్మణ్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడద తీర్చాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న అనిల్‌కుమార్

రాయికల్: పట్టణంలో కోతుల, కుక్కల బెడద సమస్యను పరిష్కరించేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ యువనాయకుడు ఎలిగేటి అనిల్‌కుమార్ మంగళవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా పట్టణంలో పారిశుద్య వాహనాలు పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో

జగిత్యాలటౌన్: క్రీడలు శారీరక,మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని మండల విద్యాధికారి గాయత్రి అన్నారు. జగిత్యాల ధరూర్ క్యాంపులోని క్రీడామైదానంలో జరిగిన గౌతమ్ హైస్కూల్ (గోవింద్‌పల్లి) స్పోర్ట్స్ మీట్ వేడుకలను ఎంఈవో గాయత్రి ప్రారంభించారు. క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటు మానసిక స్థైర్యం పెంపొంది, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కంది కైలాసం, డా శరత్‌చంద్ర, నాగమణితో పాటు పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరీ అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశం ఉదయం 10.30 నిమిషాలకు జరగాల్సి ఉండగా, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కొజన్‌కొత్తూర్ ఎంపీటీసీ భునగిరి రాజు సమావేశానికి హాజరయ్యారు. మిగతా 9 మంది ఎంపీటీసీలు గైరాజరు కావడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. సమావేశంలో జెడ్పీటీసీ భారతి, ఎంపీడీవో రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న తెల్ల బంగారం ధర

- బహిరంగ మార్కెట్లో పైపైకి..
- అమ్ముకున్నాక.. పెరుగుతోందని రైతుల నిట్టూర్పు
- నిరాశలో రైతాంగం



భీంరాజ్‌పల్లిలో ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

గొల్లపల్లి: తెల్లబంగారం ధర పైపైకి ఎగబాకుతోంది. రైతుల నుంచి పత్తి కొనుగోలు ప్రక్రియ పూర్తయిన తరువాత క్రమంగా పెరుగుతుండటంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి పత్తి ధరలు తక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేసింది. అధికంగా ఉత్పత్తులు రావడంతో కేంద్రాల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమవ్వడంతో పాటు తేమ పేరిట కొర్రీలు పెట్టారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన దళారులు బైంసా,మహారాష్ట్ర, గుజరాత్ ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు.దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.గత ఏడాది ఆరంభంలోనే క్వింటాల్ ధర రూ.8వేలు పలికింది.ఈ ఏడాది మాత్రం ఆరంభంలో రూ.7వేలుగా ఉంది.ప్రభుత్వం క్కింటాల్ ధర రూ.7,020 నిర్ణయించి కొనుగోలు చేసింది.దళారులు మాత్రం రూ.6,600 నుంచి రూ.6,700కు కొనుగోలు చేశారు. విధిలేక రైతులు తక్కువ ధరకే ప్రైవేట్‌కు అమ్ముకున్నారు.

పెరుగుతున్న పత్తి ధర..

ప్రస్తుతం పత్తి ధర పెరుగుతోంది. అమ్మకాలన్నీ పూర్తయ్యాక బహిరంగ మార్కెట్లో ధర పెరుగుతుండటంతో రైతులు మనోవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు ధర రూ.6,900 మొదలు కొని రూ.7400 వరకు పలుకుతోందని చెబుతున్నారు.ఉత్పత్తులను విక్రయించుకున్న తర్వాత పెరిగితే ఏం లాభమని వాపోతున్నారు. పత్తిని నిల్వచేసుకున్న వారికే లబ్ధి చేకూరుతుందంటున్నారు.

జిల్లాలో పత్తి సాగు ఇలా..

వర్షాకాలంలో పత్తి పంట జిల్లా వ్యాప్తంగా 18401 ఎకరాల్లో సాగైంది.సగటున ఎకరాకు 8.క్వింటాళ్ల మేరకు దిగుబడి వచ్చింది. 16456 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.మిగతా ఉత్పత్తులను రైతులు తక్కువ ధరకు ప్రైవేట్ వ్యక్తులు, దళారులకు విక్రయించారు.

ప్రైవేట్‌లో అమ్ముకున్నా



మూడెకరాల్లో పత్తి పంట సాగు చేస్తే 24 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీసీఐకి తరలించేందుకు ఇబ్బంది కావడంతో ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్న. క్వింటాలుకు రూ.6200లకు విక్రయించా. పెట్టుబడికోసం తెచ్చిన అప్పు తీర్చేందుకు ముందస్తుగానే అమ్ముకున్నాను.ఇప్పుడు ధర పెరిగితే ఏం లాభం.

– రేవెల్లి స్వామి, రైతు భీంరాజ్‌పల్లి

రూరల్ ఎంపీపీ ఏకగ్రీవానికి ప్రయత్నం

అభ్యర్థిగా మంగళారపు మహేశ్?

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎంపీపీ ఎన్నికల బుధవారం జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎంపీపీ అభ్యర్థిని ఎంపికకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఎంపీపీ పదవి కోసం నర్సింగాపూర్ ఎంపీటీసీ మంగళారపు మహేశ్, పొరండ్ల ఎంపీటీసీ ఆరె సౌజన్య మధ్య పోటీ నెలకొనగా, సోమవారం రాత్రి 11 మంది ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీంతో సమావేశంలో మెజార్టీ సభ్యులు మహేశ్ అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మహేశ్‌ను ఎంపీపీగా ఖరారు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీంతోపాటు మెజార్టీ ఎంపీటీసీలు ఎమ్మెల్యే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, తేల్చి చెప్పారు. మంగళవారం ఎంపీటీసీ సభ్యులందరిని హైదరాబాద్ తరలించారు.

విప్ జారీ..

బీఆర్‌ఎస్ పార్టీ 11మంది ఎంపీటీసీ సభ్యులకు అధిష్టానం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ద్వారా విప్ జారీ చేశారు. దీంతో జగిత్యాల రూరల్ మండల ఎన్నికల అధికారి, అడిషనల్ డీఆర్‌డీఏ మదన్‌మోహన్‌కు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల అధికారికి అందజేశారు. కాంగ్రెస్, బీజేపీ సభ్యులు క్యాంపులో ఉన్నారు. బుధవారం ఉదయం ఎంపీటీసీలు నేరుగా మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోనున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

సారంగాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడానికి కార్యకర్తలు కలిసి పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తనయుడు తాటిపర్తి రాంచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో ఎల్లమ్మ తల్లి బోనాల్లో పాల్గొని, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీపీ రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కథలాపూర్ సెంటర్‌లో నంబర్లు వేస్తున్న లెక్చరర్లు

కథలాపూర్/మల్యాల: నేటి నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాళ్లు గౌసుర్ రహమాన్, మోతె శివరామకృష్ణ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కేటాయించామన్నారు. ఫస్టియర్‌కు 301 మంది విద్యార్థులు, సెకండియర్‌కు 286 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

మల్యాల పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నూకపల్లి మోడల్‌స్కూల్, తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల, పెగడపల్లి మండలంలోని మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాలకు చెందిన 420 మంది విద్యార్థులు 415మంది రెగ్యులర్ విద్యార్థులు, ఐదుగురు ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

ధర్మపురి: నేటి నుంచి ప్రారంభం కానున్న అధికారులు ఇంటర్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ రామయ్య ఆధ్వర్యంలో ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మగ్గిడి మోడల్‌స్కూల్, మైనార్టీ వెల్ఫేర్ కళాశాలలకు చెందిన మొత్తం 298 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వాహణకు ఏర్పాటు చేసినట్లు కళాశాల పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి(సీఎస్) ఎంఎ.కాలిక్ తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో డిపార్ట్‌మెంటల్ అధికారి(డీవో) నర్సయ్య,ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. మొత్తం 445 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

రాయికల్: మండలంలో ఐదేళ్ల ఏళ్లలోపు చిన్నారులకు ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేసేలా చూడాలని ఎంపీడీవో చిరంజీవి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మార్చి3 న నిర్వహించే పల్స్‌పోలియోపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బందికి శిక్షణ సమావేశం నిర్వహించారు. 5 ఏళ్ల లోపు చిన్నారులను గుర్తించి వంద శాతం పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, ఎంపీవో సుష్మ, సీహెచ్‌వో ప్రమీల, హెచ్‌ఈవో శ్రీనివాస్, హెఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలి

పెగడపల్లి:ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని నందగిరి, అయితిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. అనంతరం కంపోస్టు షెడ్లు, వననర్సరీలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని, షెడ్‌నెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కంపోస్టు ఎరువులను నర్సరీల్లో మొక్కలకు వాడాలని సూచించారు.మొక్కల సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులతే అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

బీజేపీకే రాముడి గురించి మాట్లాడే హక్కు

మల్యాల: నిరుపేదల ఆకలి తీర్చేందుకు నాలుగేళ్లుగా బీజేపీ ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోందని, రామాలయం నిర్మించిన బీజేపీకి మాత్రమే రాముడి గురించి మాట్లాడే హక్కు ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్రిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలో జిల్లా అధికార ప్రతినిధి మద్రిపల్లి సత్యం, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. బీజేపీ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తోందని,కాంగ్రెస్ చరిత్ర తెలుసుకుని, వాస్తవాలు మాట్లాడాలన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుని, బీజేపీని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశం, పి.సాయికుమార్, పిల్లి రాజశేఖర్, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, సభ్యులు

జగిత్యాలజోన్: ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి వచ్చిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను జిల్లా పరిషత్ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. అలాగే కలెక్టర్ యాస్మిన్ భాషాతో పాటు జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డిప్యూటీ సీఈవో రఘువరన్ ను జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, జెడ్పీటీసీలు, అధికారులు సన్మానించారు.

మహిళల రక్షణకు షీటీం నిరంతర కృషి

జగిత్యాలక్రైం: మహిళల రక్షణకు షీటీం నిరంతర కృషి చేస్తుందని షీటీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ జ్యోతిబా పూలే స్కూల్,కాలేజీలో షీం టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల రక్షణకు, వారిపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు షీటీం నిరంతరం పనిచేస్తోందన్నారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీం నంబరు 8712670783కి సంప్రదించాలన్నారు. సామాజిక మాధ్యమాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబరు 1930, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాల్నారు. శంకరయ్య, మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, పూజిత పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

మల్లాపూర్: మామిడి తోటల్లో చీడపీడల నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నియోజకవర్గ ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. మండలంలోని రాఘవపేటలో మల్లాపూర్ రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో మామిడి తోటలను ఆయన పరిశీలించారు. చీడపీడల నుంచి నివారణకు అధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటిస్తే అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతుపై హర్షం

బుగ్గారం: బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద చేతి పంపు చెడిపోయి చాలాకాలం పాటు నిరుపయోగంగా మారింది. ఎక్స్‌రోడ్డు వద్ద వేచి ఉండే ప్రయాణికులకు ఈ చేతిపంపు ఎంతగానో ఉపయోగపడేది. దీని మరమ్మతుల గురించి స్థానికులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారులు మంగళవారం చేతిపంపుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలు

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలను గ్రామ స్థాయిలో అందిస్తున్నట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకు జగిత్యాల శాఖ మేనేజర్ వేలుమురుగన్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పోరండ్లలో పాల ఉత్పత్తి రైతులకు బ్యాంకు ఖాతాలు, ఏటీఎంలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నేరుగా బ్యాంకు రావాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దనే ఖాతాలు, ఏటీఎంలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఎక్కడైనా బ్యాంకు సేవలు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల గ్రామశాఖ సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, బ్యాంకు క్యాషియర్ శేషగిరి నివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోరుట్ల: పట్టణంలోని శివనందిని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1996–97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

అల్లీపూర్ కార్యదర్శికి సన్మానం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామ కార్యదర్శిగా పనిచేసిన అక్బర్ బదిలీ కాగా, మంగళవారం గ్రామ యువజన సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ ముఖీద్, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం,నాయకులు మోర వెంకటేశ్, సాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా మండలంలోని పైడిమడుగులో మంగళవారం ఉదయం మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వార్డులను సందర్శించి వార్డుల్లో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆరోగ్య సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా ఎక్స్‌రేలు, మందుల చిట్టీలు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఎమైనా పెద్ద ఆరోగ్య సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి స్పెల్ విజార్డ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందించిన డీఈవో

జగిత్యాలరూరల్/కోరుట్ల: హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్పెల్ విజార్డ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థిని రాచర్ల అశ్రిత వర్మ, కొత్తపేట హైస్కూల్ విద్యార్థి ఖలీల్ రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా అశ్రిత, ఖలీల్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగసుధారాణి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, ముజీబున్నీసా, శివకుమార్ పాల్గొన్నారు.

సీతారామాంజనేయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామ శివారులో రామలక్ష్మణ గుట్టపై నేటి నుంచి శ్రీ సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరగనున్నాయి. గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో మొదటి రోజు 28న విష్ణు సహస్ర పారాయణం, ప్రతిష్ఠమూర్తుల శోభాయాత్ర, వివిధ పూజలు, 29న అభిషేకాలు, ఇతర పూజలు, 30 న యంత్రమూర్తుల ప్రాణ ప్రతిష్ఠ, హోమం, కల్యాణం, మిగతా పూజలు నిర్వహించనున్నారు. 29న జరిగే పూజ కార్యక్రమాల్లో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహాచార్యులు పాల్గొంటారని గ్రామస్తులు తెలిపారు.

ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్లాపూర్: ఎస్సెస్సీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీహరి అన్నారు. మండలంలోని సాతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ డేలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, గేమ్ షోలు, అభినయ కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతరలో మినరల్ వాటర్ సరఫరా

సారంగాపూర్: బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీర్‌పూర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు గత పదేళ్లుగా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూనే, బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి జాతరలో భక్తుల కోసం షెడ్ల నిర్మాణం చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు మూడు రోజులపాటు మినరల్ వాటర్ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, ఎస్సై గౌతంపవార్, కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఆలయ చైర్మన్ ఎనగంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సభా సంఘం కాలయాపన చేయొద్దు

కోరుట్లరూరల్: ముత్యంపేట చక్కెర కర్మాగారం పునరుద్ధరణకు ప్రభుత్వం సభ సంఘం నియమించటం హర్షనీయమని మోహన్‌రావుపేట మాజీ సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నియమించిన సభా సంఘాలు కాలయాపన చేసినట్లు ప్రస్తుత సభా సంఘం కాలయాపన చేయకుండా ప్రభుత్వం త్వరగా చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేపట్టే విధంగా నివేదిక ఇవ్వాలని కోరారు.

పోలీస్ క్వార్టర్ల పరిశీలన

సారంగాపూర్: మండలంలోని పోలీస్ స్టేషన్ క్వార్టర్లు, పరిసరాలను డీఎస్పీ రఘుచందర్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సై తిరుపతి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ శివారులో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి జాతర



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు ఐదోరోజు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ మల్లికార్జున స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువజామున భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ మహోత్సవాల్లో ఎంపీటీసీ దేవ ముత్తమ్మ మల్లయ్య, ప్యాక్స్ వైస్‌చైర్మన్ గొండ రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి అగ్నిగుండాలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మంగళవారం మల్లికార్జునస్వామి అగ్నిగుండాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చాలని భక్తులు అగ్నిగుండంలో నుంచి కాలినడకన వెళ్లారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో నిర్వాహకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యాదవసంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు..

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో మంగళవారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, వనతడుపుల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.